క్లుప్తంగా

ముమ్మరంగా కొత్త స్లీపర్ ఏర్పాటు



స్లీపర్లు మార్చుతున్న సిబ్బంది

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్ సమీపంలోని కాపుజగ్గరాజుపేట వైపు కొత్త స్లీపర్ల ఏర్పాటు పనులు ముమ్మరంగా చేపడుతున్నారు. అధిక సంఖ్యలో సిబ్బంది పాత వాటిని తొలగించి కొత్తవి ఏర్పాటు చేస్తున్నారు. అధికారుల పర్యవేక్షణలో పనులు సాగుతున్నాయి.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెదగంట్యాడ: 11కేవీ దిబ్బపాలెం, మదీనాబాగ్ 11కేవీ ఫీడర్, 11కేవీ పాలవలస ఫీడర్ల పరిధిలో మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో శనివారం పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఈపీడీసీఎల్ జోన్-2 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బీకే నాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దిబ్బపాలెం ఫీడర్ పరిధిలో గొడ్డువానిపాలెం, గొందేశి వీధి, కండిపల్లి వీధి, వెంకన్నపాలెం, కొంగపాలెం, సత్యనారాయణపురం, యాతపాలెం, ఉప్పర కాలనీ, గంగవరం, బడివారి వీధి, జాలరిపల్లిపాలెం, ధారకొండ వీధి, దిబ్బపాలెం ఆర్‌హెచ్ కాలనీ..

- మదీనాబాగ్ ఫీడర్ పరిధిలోని మదీనాబాగ్, జేఎన్ఎన్‌యూఆర్ఎం బిల్డింగ్స్
- పాలవలస ఫీడర్ పరిధిలో మద్దివానిపాలెం, నమ్మిదొడ్డి, ఇస్లాంపేట, దేవాడ, అప్పికొండ, లక్ష్మీనగర్, శ్రీరామ్‌నగర్, మురుభాయ్, పాలవలస, గొల్లపేట, ఈసరపువానిపాలెం, యలమంచిలిదొడ్డి, గిన్నిపాలెం, నక్కదొడ్డి తదితర ప్రాంతాల్లో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.వినియోగదారులు సహకరించాలని కోరారు.

నూతన అంబులెన్స్‌ల ప్రారంభం



108 వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

గాజువాక: రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన రెండు 108 వాహనాలను ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధునాతన సౌకర్యాలు ఉన్న అంబులెన్స్‌లను జిల్లాకు కేటాయించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో 108 జిల్లా మేనేజర్ ఎం.సురేష్, ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ సయ్యద్ సమీర్ తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతో ఆరోగ్యం పదిలం



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

అగనంపూడి: పోషకాహారంతో దీర్ఘకాలిక రోగాల బారిన పడకుండా వ్యక్తిగత ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని దువ్వాడ విజ్ఞాన్ ఫార్మా కళాశాల ప్రిన్సిపాల్ వై.శ్రీనివాసరావు అన్నారు. జాతీయ పోషకాహార పక్షోత్సవాల్లో భాగంగా విజ్ఞాన్ కళాశాల పరిసర గ్రామాల్లో శుక్రవారం ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీలు నిర్వహించారు. చిరుప్రాయం చిరుతిల్లు, కారం, మసాలా వంటి స్పైసీ ఫుడ్‌లను తగ్గించుకోవాలన్నారు. కార్యక్రమంలో వలంటీర్లు పాల్గొన్నారు.

సుప్రీం తీర్పు ప్రకారం పెన్షన్ ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆదినారాయణ

పెదగంట్యాడ: సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం పెన్షన్లు ఇవ్వాలని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి ఆదినారాయణ డిమాండ్ చేశారు. స్థానిక పెదగంట్యాడ సీడబ్ల్యూసీలో పెన్షనర్లతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈపీఎఫ్ 95 పెన్షన్‌దారులందరికీ డిమాండ్ నోటీసులు పంపించాలని కోరారు. సమావేశంలో కణితి అప్పలరాజు, వైటీ దాస్, అప్పలస్వామి, దీనబంద్, హుస్సేన్, పెంటారావు తదితరులు పాల్గొన్నారు.

కళకు జీవం

కవిగా, గాయకుడిగా.. శిక్షకుడిగా రాణింపు
ప్రశంసలు అందుకుంటున్న రమేష్‌బాబు

ఎవరైనా ఏదో ఒక రంగాన్ని ఎంచుకుంటారు.. ఆ రంగంలో నైపుణ్యాన్ని పెంపొందించుకొని దానిపై పట్టు సాధిస్తారు. అయితే జీవీఎంసీ 87వ వార్డు తిరుమలనగర్‌కు చెందిన సీపాన రమేష్‌బాబు అందుకు భిన్నంగా పలు రంగాల్లో రాణిస్తూ శభాష్ అనిపించుకుంటున్నారు. ఉద్యోగం చేస్తూనే కళలు, కళారంగంపై ఆసక్తి పెంచుకొని వాటిపై పట్టు సాధించారు. కవిగా, హార్మోనిస్ట్‌గా, గాయకుడిగా.. నటుడిగా విభిన్న పాత్రలు పోషిస్తున్నారు. మరోవైపు పిల్లలకు సంగీతంలో శిక్షణ ఇస్తూ కళకు జీవం పోస్తున్నారు. – కూర్మన్నపాలెం



హార్మోనియం వాయిస్తున్న రమేష్‌బాబు, చిత్రంలో అందుకున్న అవార్డులు

శ్రీకాకుళం జిల్లా పోలాకి మండలం రేగుపాడు గ్రామంలో అప్పలనాయుడు, అనసూయమ్మ దంపతులకు రమేష్‌బాబు జన్మించారు. చదువు అదే జిల్లాలో కొనసాగించారు. ఆయన తండ్రి అప్పలనాయుడు భాగవత ప్రవచనాలు వల్లించడంలో దిట్ట కావడంతో ఆయన వద్దే మెలకువలు నేర్చుకొని బాలనటుడిగా నటనకు శ్రీకారం చుట్టారు. అతిపిన్న వయసులోనే భక్త మార్కండేయ నాటకంలో బాల మార్కండేయ పాత్ర ద్వారా కళాకారుడిగా పరిచయమ్యారు. అలా అనేక డ్రామాల్లో పలు వేషాలు వేయడం ద్వారా రంగస్థలంలో రాణించిన ఆయన సంగీతంపై దృష్టి పెట్టారు. ఆ రంగంలో కూడా గుర్తింపు తెచ్చుకోవాలన్న పట్టుదలతో శ్రీకాకుళం జిల్లా వాల్తేరు గ్రామానికి చెందిన గొల్లపల్లి గోవిందరావు వద్ద శిష్యుడిగా చేరారు. సంగీతం సాధన చేయడం ద్వారా హార్మోనియం కూడా నేర్చుకున్నారు. అనతి కాలంలోనే హార్మోనియం వాయించడంలో నైపుణ్యం సాధించిన రమేష్ గాన కచేరీలు చేస్తూ భజన బృందాలకు నాయకత్వం వహించడం ప్రారంభించారు. ఆ రంగంలో కీర్తి ప్రతిష్టలు సంపాదించుకున్నారు.



వినాయక మండపంలో హార్మోనియం వాయిస్తూ..

ఉద్యోగ రీత్యా తిరుమలనగర్‌కు..

విశాఖ ఉక్కు కర్మాగారంలో ఉద్యోగం రావడంతో రమేష్ కూర్మన్నపాలెం దరి తిరుమలనగర్‌లో స్థిరపడ్డారు. అయినా ఏరంగాన్ని విడిచి పెట్టలేదు. కణితి రామాలయం వేదికగా బాలభారతి భజనమండలిని స్థాపించారు. అనేక మందిని సభ్యులుగా చేర్చి వారి సహాయంతో గాత్ర కచేరీలు, భగవద్గీత పారాయణం చేస్తూ పేరు ప్రఖ్యాతులు సంపాదించుకున్నారు. ముఖ్యంగా అన్నమాచార్య కీర్తనలు, సుందరకాండ గానం, భజనలు చేయడం ద్వారా సంగీతంపై మరింత పట్టు సాధించారు.

8 వేలకు పైగా స్టేజ్ ప్రోగ్రాంలు

ఇప్పటివరకు సుమారు ఎనిమిది వేలకు పైగా స్టేజి ప్రోగ్రాంలు ఇచ్చిన రమేష్‌బాబు ఎందరో ప్రశంసలు అందుకున్నారు. తన వద్ద పాటలు, సంగీతం నేర్చుకునేందుకు అనేకమంది ఆసక్తి చూపడంతో తన ఇంటినే సంగీత పాఠశాలగా మార్చేశారు. అక్కడే గీతాచార్య భక్తి గీతాంజలి సంస్థను స్థాపించి అనేకమందికి సంగీతంలో శిక్షణ ఇస్తున్నారు.

బిరుదులు.. పురస్కారాలు

రమేష్‌బాబు సంగీతంతో అలరించడంతో 2010లో ఉక్కునగరం జరిగిన కార్యక్రమంలో శారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామీజీ సత్కరించారు. ధర్మబాట శతకం, సుగుణ శతకం, భక్తిశతకం, భక్తి గీతాంజలి వంటి రచనలు చేసి పుట్టిన ఊరితో పాటు విధులు నిర్వహించిన సంస్థకు పేరు ప్రఖ్యాతులు తీసుకువచ్చారు. ఇప్పటికే ఆయన గీతగాన విశారద, సంకీర్తనశ్రీ వంటిబిరుదులను సొంతం చేసుకున్నారు. అంతేకాకుండా ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లాల్లో మునుపెన్నడూ ఎవరూ చేయని విధంగా తొమ్మిది సంకీర్తన యజ్ఞాలు నిర్వహించి రికార్డు నెలకొల్పారు.



మాజీ ఎమ్మెల్యే గురుమూర్తిరెడ్డి నుంచి సత్కారం పొందుతున్న రమేష్‌బాబు

కళలను బతికించడమే లక్ష్యం

ఒక వైపు ఉద్యోగం చేస్తూ మరో వైపు కళలను పోషించుకొంటూ వచ్చాను. ఇటీవలే ఉక్కు కర్మాగారంలో స్వచ్ఛంద పదవీ విరమణ పొందాను. దీంతో పూర్తిస్థాయిలో కళలను మరింత విస్తృతం చేయడానికి అవకాశం లభించింది. ఎక్కువ మందికి గానంలో, హార్మోనియంలో శిక్షణ ఇచ్చి మంచి కళాకారులను తయారు చేయాలన్న సంకల్పంతో పనిచేస్తాను. జానపదాలు, కోలాటం కళలను బతికించడమే లక్ష్యంగా పని చేస్తాను.

– సీపాన రమేష్‌బాబు, కళాకారుడు

విమల విద్యాలయం ఉపాధ్యాయుల నిరసన



తెలుగుతల్లి విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

ఉక్కునగరం: ఉపాధ్యాయ దినోత్సవం రోజున ఉక్కునగరం విశాఖ విమల విద్యాలయం ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. విమల విద్యాలయాన్ని మూసి వేయడానికి నిరసనగా శుక్రవారం ఉపాధ్యాయులు కణితి జంక్షన్ కూడలి వద్ద ఉన్న తెలుగు తల్లి విగ్రహం వద్ద ప్లకార్డులు, బ్యానర్లు పట్టుకుని ఆందోళన చేపట్టారు. తమకు ఉద్యోగం లేకుండా చేయడం దుర్మార్గమన్నారు. న్యాయం చేయాలంటూ నినాదాలు చేశారు. అంతకు ముందు అక్కడే సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో స్టాఫ్ సెక్రటరీ బి. సత్యనారాయణ, జాయింట్ సెక్రటరీ అనిత, సత్యం, మధుసూదన్, శ్రీనివాస్, నాగవల్లి, జ్యోతి, మణి, రెజీనా, సుధ, శోభ, జయ, శేషమణి, మేరీ సుగుణ, సుశీల, వెంకటరావు, ప్రసాద్ పాల్గొన్నారు.

'రజకులపై దాడి చేసిన వారిని శిక్షించాలి '

అగనంపూడి: శ్రీకాకుళం జిల్లా కొత్తవలసలో రజకులపై దాడి చేసి మహిళ మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని విశాఖ జిల్లా రజక సంఘం అధ్యక్షుడు తోకాడ రాము డిమాండ్ చేశారు. ఆరుగురి తలకాయలు పగలడానికి కారణమై, వారిలో ఒకరు మృతి చెందారని దీనికి కారణమైన పోలీసులపై మర్డర్ కేసు నమోదు చేసి తక్షణమే అరెస్టు చేయాలన్నారు. ఈవిషయంలో హోం మంత్రి స్పందించి ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

గురువులకు ఘన సత్కారం



ఉత్తమ అధ్యాపకురాలికి నగదు పురస్కారం అందజేస్తున్న అతిథులు

పెదగంట్యాడ: విద్యావేత్తగా, పరిపాలనాధ్యక్షునిగా విశేష సేవలు అందించిన డాక్టర్ సర్వేపల్లి రాధకృష్ణన్ నేటి ఉపాధ్యాయులకు ఆదర్శప్రాయుడని పెదగంట్యాడ శాఖా గ్రంథాలయాధికారి పి. వెంకటరమణ అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పాఠకులతో కలసి శుక్రవారం ఘనంగా నిర్వహించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ సమాజంలో ఉపాధ్యాయ వృత్తికి ఎనలేని గౌరవం ఉందన్నారు.కార్యక్రమంలో పాఠకులు లోకవరపు సురేష్, నరేష్, నవ్య, రాంబాబు, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



రాధాకృష్ణన్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న గ్రంథాలయాధికారి రమణ తదితరులు

అధ్యాపకులకు నగదు పురస్కారాలు

గాజువాక: స్థానిక టీఎస్సార్, టీబీకే కళాశాల, యాపిల్ ఐ స్కూల్‌లో నిర్వహించిన గురుపూజోత్సవం సందర్భంగా అధ్యాపకులకు అవార్డులతో పాటు నగదు పురస్కారాలు అందజేశారు. ఉపాధ్యాయిని సంతోషికి యాపిల్ రత్న అవార్డుతో పాటు రూ.25వేల నగదు పురస్కారాన్ని ఆంధ్రా యూనివర్సిటీ పూర్వ రిజిస్ట్రార్ వి.ఉమా మహేశ్వరరావు చేతులమీదుగా అందజేశారు. ఆమెతోపాటు ఉత్తమ అధ్యాపకులుగా ఎంపికైన వై.విజయశ్రీ, వి.ఎస్.నాయుడు, ఇందిరా తులసీ, హరిణి తదితరులకు రూ.10 వేల చొప్పున నగదు పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ టి.బలరామకృష్ణ, కరస్పాండెంట్ ఉమా మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎంవీఆర్ డిగ్రీ కళాశాలలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి ఘన నివాళులర్పించారు. ఇక్కడ వేడుకలను యూనివర్సిటీ పూర్వ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జి.నాగేశ్వరరావు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గురువులను దైవంతో పోల్చిన సంస్కృతి మనది అని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, కళాశాల కరస్పాండెంట్ వి.రామారావు తదితరులు పాల్గొన్నారు.



కణితి పాఠశాల ఉపాధ్యాయులను సత్కరిస్తున్న పెద్దలు



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఏయూ పూర్వ వీసీ నాగేశ్వరరావు

కణితిలో..

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 87వ వార్డు కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవంలో కణితి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గణిత శాస్త్ర ఉపాధ్యాయుడు బి.నాగమోహనరావును సత్కరించారు. వక్తలు మాట్లాడుతూ మోహనరావు మాష్టారు గురువుగా ఎంతో మందికి ఉన్నత భవిష్యత్ కల్పించారన్నారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ పెద్దలు ప్రగడ శ్రీనివాస్, బొడ్డ గోవింద్,దుగ్గపు దానప్పలు, దామోదర్, అప్పలనాయుడు, గోవిందరాజులు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మిలాద్- ఉన్‌నబీ



ర్యాలీలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే నాగిరెడ్డి

గాజువాక: మహ్మద్ ప్రవక్త 1500వ జయంతి సందర్భంగా గాజువాకలో ముస్లింలు శుక్రవారం శాంతియాత్ర నిర్వహించారు. మిలాద్ -ఉన్ నబీ కార్యక్రమంలో భాగంగా సర్వ మానవాళికి శుభాకాంక్షలు తెలుపుతూ నిర్వహించిన ఈ శాంతి యాత్ర కణితి రోడ్ నుంచి మెయిన్ రోడ్ మీదుగా కొనసాగింది. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ర్యాలీలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి మాట్లాడుతూ మహ్మద్ ప్రవక్త జయంతి సందర్భంగా ముస్లింలు సోదరభావాన్ని చాటుకుంటారని అన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి ఎస్ఎండీ గౌస్ మాట్లాడుతూ హజ్రత్ మహ్మద్ ఈ ప్రపంచానికి శాంతి, సత్యం, దయ, సమానత్వం అనే విలువలను అందించిన మహానుభావుడని పేర్కొన్నారు. ప్రతి పనిలోన్యాయం, దయ, కరుణ అనే మూల సూత్రాన్ని అందించారన్నారు. అనంతరం మహ్మద్ ప్రవక్త జీవిత విశేషాలపై ప్రవచనాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో 66వ వార్డు కార్పొరేటర్ మహ్మద్ ఇమ్రాన్, నాయకులు షౌకత్ అలీ, మోతి, దుబాయ్ బాషా, లుక్మాన్, ఇర్ఫాన్, సయ్యద్, అఫ్రీద్, సుభాన్ తదితరులు పాల్గొన్నారు.

భారీగా అన్నసమారాధనలు



భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

పెదగంట్యాడ: గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా జీవీఎంసీ 76వ వార్డు హౌసింగ్‌బోర్డు కాలనీలో యువక్రాంత్ యువజన సేవా సంఘం సభ్యులు నడుపూరు రాజు, శ్రీకాంత్ ఆధ్వర్యంలో గణపతి మండపం వద్ద శుక్రవారం అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమాన్ని మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ప్రారంభించి భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణపతి ఉత్సవాలను పురస్కరించుకుని యువత భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో 76వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు మంత్రి శంకరనారాయణ, నాయకులు పాల్గొన్నారు.



తూర్పుకాపు వీధిలో ప్రసాదాలు వడ్డిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

తూర్పుకాపు వీధిలో..

కూర్మన్నపాలెం: వినాయక ఉత్సవాల్లో భాగంగా కణితి తూర్పుకాపు వీధిలో శుక్రవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. వివిధ కాలనీలకు చెందిన ప్రజలు హాజరై ముందుగా గణపతిని దర్శించుకుని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. వార్డుకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు పి.శ్రీనివాస్ దానప్పలు, గోవింద్, దామోదర్, రాములు, ప్రసాద్, సత్తిబాబు తదితరులు పాల్గొని అన్నప్రసాదాలు వడ్డించారు.



శీకువానిపాలెంలో కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

పెదగంట్యాడ: జీవీఎంసీ 75వ వార్డు పరిధి శీకువానిపాలెంలో శెట్టిబలిజ యువజన సేవాసంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో శుక్రవారం కుంకుమ పూజలు చేశారు. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

దసరా ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

గాజువాక: గాజువాక ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న (వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి) దసరా నవరాత్రుల పోస్టర్‌ను సంఘం నాయకులు శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 22 నుంచి 11 రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించనున్నామన్నారు. ఎప్పటిలాగే ఈ ఏడాది కూడా దసరా ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు కులుకూరి మంగరాజు, కేశారపు సతీష్, ఎ.వి.ఎస్.ఎన్.గుప్త, కోట అనంత గోపాలరావు, ఊడ వరహాలశెట్టి, సన్నిధి పద్మనాభమూర్తి, నంబూరు జగన్నాథరావు, కారుమూరు మహేష్, వరద కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కాపర్ ప్లేట్ల చోరీపై వాస్తవాలు వెల్లడించండి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ బ్లాస్ట్‌ఫర్నేస్ విభాగంలో ఇటీవల జరిగిన కాపర్ ప్లేట్ల దొంగతనంపై వాస్తవాలు వెల్లడించాలని స్టీల్ సీఐటీయూ నాయకులు కోరారు. యూనియన్ అధ్యక్షుడు వై.టి. దాస్, ప్రధాన కార్యదర్శి యు. రామస్వామి శుక్రవారం ఈ మేరకు డైరెక్టర్ (ఆపరేషన్స్)కు వినతిపత్రం అందజేశారు. బీఎఫ్ విభాగంలో రూ. 60 లక్షల విలువైన ఆరు కాపర్ స్టేవ్స్ చోరీకి గురైనట్టు పోలీసులకు అధికారులు ఫిర్యాదు చేశారన్నారు. దొంగతనం వెనుక కార్మిక నాయకుడి ప్రమేయం ఉన్నట్టు వస్తున్న ఆరోపణలపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

పార్కింగ్ చార్జీలు తగ్గించాలని వినతి

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్ పరిధిలోని రైల్వే స్టేషన్ల వద్ద గల పార్కింగ్ స్థలాల్లో పార్కింగ్ చార్జీలు తగ్గించాలని కోరుతూ పలువురు రైల్వే ప్రయాణికులు శుక్రవారం దొండపర్తి డీఆర్ఎం కార్యాలయంలో సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్‌కు వినతిపత్రం సమర్పించారు. రూ.300 పార్కింగ్ చార్జీలు ఉండేవని, రూ.700కు పెంచారని వారు తెలిపారు.

భక్తితో దీపారాధన.. విశేష పూజలు



బియ్యం గింజలతో రూపొందించిన సింహాచలేశుడికి దీపారాధన చేస్తున్న మహిళలు



వినాయకునికి పూజలు చేస్తున్న మహిళలు



అన్న సమారాధనను ప్రారంభిస్తున్న కోమటి శ్రీనివాసరావు దంపతులు

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 87వ వార్డు వడ్లపూడి యాతపాలెంలో వినాయక ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. శుక్రవారం ఉదయం స్వామి వారికి అభిషేకాలు, విశేష పూజలు చేశారు. మధ్యాహ్నం అన్న సమారాధన చేపట్టారు. సాయంత్రం బియ్యంతో రూపొందించిన సింహాచలేశుడి ప్రతిమకు సామూహిక దీపారాధన చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య, 87వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి కోమటి శ్రీనివాసరావు దంపతులు, నిర్వాహకులు చేబోలు శంకరరావు, శ్రీను, కుమార్, ప్రసాద్, ప్రవీణ్, వినయ్, శివ, సింగిపురం శంకరరావు, కల్యాణ్, పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో రిటైర్డ్ ఉద్యోగి మృతి



అప్పారావు (ఫైల్)

గాజువాక: ఆటోనగర్ సమీపంలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో రిటైర్డ్ ఉద్యోగి మృతి చెందారు. గాజువాక పోలీసులు తెలిపిన వివరాలు.. తుంగ్లాం గ్రామానికి చెందిన కోన చినఅప్పారావు(70) భెల్ హెచ్‌పీవీపీలో పని పదవీ విరమణ చేశారు. ప్రస్తుతం గాజువాకలోని ఓ దుకాణంలో సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వహిస్తున్నారు. గురువారం రాత్రి ద్విచక్ర వాహనం పై విధులకు వెళ్తుండగా ఆటోనగర్‌లో అన్నా క్యాంటీన్ సమీపంలో ట్రాలర్ ఢీ కొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడిన ఆయన్ను స్థానికులు ఆస్పత్రికి తరలించేందుకు ప్రయత్నించగా అప్పటికే అప్పారావు మృతి చెందాడని నిర్ధారణ చేసుకుని గాజువాక పోలీసులకు సమాచారం అందించారు. అప్పారావు భార్య గతేడాది మృతి చెందగా ఆయనకు ముగ్గురు కుమారులు ఉన్నారు. గాజువాక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఫైనాన్షియల్ ఫ్లేవర్స్ పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

పెదగంట్యాడ: బ్యాంకింగ్, ఆర్థిక రంగంలో స్పష్టమైన అవగాహన కల్పించే విధంగా ఫైనాన్షియల్ ఫ్లేవర్స్ అనే పుస్తకం రచించడం అభినందనీయమని ఏవీఎస్ఎన్ గుప్తా, విజ్ఞాన్ కళాశాల డీన్ డాక్టర్ సతీష్‌కుమార్ అన్నారు. బీసీ రోడ్డులోని వాసవీ సేవాసదన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన వాసవీక్లబ్, ఆర్యవైశ్య సంఘాల సమావేశంలో బెల్లాల పెంటబాబు, శశికళ దంపతులు రచించిన ఈ పుస్తకాన్ని వారు ఆవిష్కరించారు. బ్యాంకింగ్ రంగంలో అనుభవంతో బ్యాకింగ్, ఆర్థిక లావాదేవీలపై స్పష్టమైన అవగాహన కలిగించేలా పుస్తకం రచించారని అభినందించారు. కార్యక్రమంలో వివిధ సంఘాల ప్రతినిధులు మంగరాజు, కారుమూరి మహేష్, పి నాగేశ్వరరావు, బొడ్డు కృష్ణారావు, బచ్చు అప్పలరాజు, హర్ష, బెల్లాల వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.